క్లుప్తంగా

అసిస్టెంట్ ట్రెజరీ అధికారికి సత్కారం



అసిస్టెంట్ ట్రెజరీ అధికారిని లక్ష్మీసుభాషిణిని సత్కరిస్తున్న రిటైర్డు ఉద్యోగుల సమాఖ్య

రామచంద్రపురం: గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న రామచంద్రపురం సహాయ ఖజానా అధికారి జొన్నాడ లక్ష్మీసుభాషిణిని స్థానిక రిటైర్డు ఉద్యోగుల సమాఖ్య సోమవారం దుశ్శాలువతో సత్కరించింది. సమాఖ్య అధ్యక్షుడు పట్నాల రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి తటవర్తి రాఘవరాజు, ఆర్థిక కార్యదర్శి పీపీఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు అంపోలు సత్యనారాయణ, అప్పల ప్రభాకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంపై రైతులు శ్రద్ధ వహించాలి

కాజులూరు: వ్యవసాయ సేద్యంలో రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులను సక్రమంగా నిర్వహించినప్పుడే పైరు ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడులు సాధించగలుగుతారని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని చేదువాడలో ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు పంటదమ్ములో మొదటి దఫాగా 25 కేజీల పొటాష్ ఎరువును విధిగా వేయ్యాల్సి ఉందన్నారు. రెండో దఫాగా వరి మొక్క చిరుపొట్ట దశలో మరో 25 కేజీల పొటాష్ ఎరువును వేసినట్లయితే ఓ మోస్తరు తేలికపాటి గాలులకు పంట పడిపోకుండా ఉండి అధిక దిగుబడులకు అవకాశం ఉంటుందన్నారు.

పలువురికి ఎమ్మెల్సీ తోట పరామర్శ

కపిలేశ్వరపురం: పితృ వియోగంతో బాధపడుతున్న కేదారిలంక గ్రామ సచివాలయ కన్వీనర్ వీధి గంగాధర్, సోదరులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం పరామర్శించారు. అప్పులను కోల్పోయి బాధల్లో ఉన్న గ్రామానికి చెందిన మరి కొందరిని ఎమ్మెల్సీ తోట పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, ఉప సర్పంచ్ యర్రంశెట్టి సత్తిబాబు, సచివాలయ కన్వీనర్లు, యర్రంశెట్టి నాగేంద్ర, కాశి శ్రీను, నాయకులు మద్దింశెట్టి దొరబాబు ఉన్నారు.

పలువురికి చైర్ పర్సన్ దుర్గారాణి పరామర్శ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం 7వ వార్డుకు చెందిన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సచివాలయ గృహ సారథి ఉందుర్తి సత్తిబాబు కుటుంబ సభ్యులను మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి సోమవారం పరామర్శించారు. 24, 27 వార్డుల్లో వృద్ధాప్యంతో మృతి చెందిన పలువురు కుటుంబాల వారిని పరామర్శించారు. పరామర్శించిన వారిలో వార్డ్ కౌన్సిలర్లు సవరపు సతీష్, నీలం దుర్గ, శెట్టి కళ్యాణి, వైస్సార్ సీపీ నాయకులు కొడమంచిలి భాస్కరరావు, జొన్నపల్లి సత్తిబాబు, అడబాల వీరబాబు, గృహ సారథి కొల్లి చిన్న ఉన్నారు.

పాఠశాలల్లో పరీక్ష పే చర్చ



ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాయవరం: విద్యార్థుల్లో పరీక్షలపై ఉన్న భయాన్ని, ఆందోళన తొలగించేందుకు కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రధానమంత్రి పరీక్ష పే చర్చ' కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా విద్యార్థులు వీక్షించారు. ప్రధానమంత్రి పరీక్ష పే చర్చ ఏడవ ఎడిషన్ సోమవారం ప్రత్యక్ష ప్రసారమైంది. ఉదయం 11గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా బోర్డు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ విద్యార్థులతో ముఖాముఖీ సంభాషించారు. పరీక్షలను ఒత్తిడి లేకుండా ఎదుర్కోవడం, చక్కగా పరీక్షలకు సమాధానాలు రాయడం ద్వారా విద్యార్థులకు పరీక్షలంటే భయాన్ని తొలగించేందుకు ప్రధానంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలి..విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్లు ఏమిటి? వాటిని ఎలా అధిగమించాలి? విద్యార్థుల ఆకాంక్షలు ఏమిటి? వాటిని చేరుకోవడానికి అనుసరించాల్సిన మార్గాలు ఏమిటి? వంటి అంశాలపై 'పరీక్షా పే చర్చ' చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సంధించిన ప్రశ్నలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమాధానమిచ్చారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీలు ఉన్న పాఠశాలల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు విద్యార్థులకు ప్రత్యక్ష ప్రసారాన్ని చూపించారు. జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి, సమగ్ర శిక్షా ఏపీసీ ఎ.మధుసూదనరావు, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులు వీక్షించేలా పర్యవేక్షణ చేశారు.

ప్రజా వ్యతిరేక పొత్తులపై పోరుకు సిద్ధం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వైఎస్సార్‌సీపీ మండల శ్రేణులకు దిశా నిర్దేశం

కపిలేశ్వరపురం: రానున్న ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్న పొత్తులపై ప్రజా పోరుకు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపు నిచ్చారు. కపిలేశ్వరపురం మండల స్థాయి వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం సోమవారం అంగర గ్రామంలో నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ శీలం గోవింద్, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, 19 పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులు ఆధ్వర్యంలో ×పోరుకు సిద్ధం× సమావేశాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. డబ్బు, పెత్తందారీ రాజకీయాలకు కాలం చెల్లిందన్నారు. అవినీతి, అక్రమాలు, పక్షపాతం లేకుండా పేదలకు మేలు చేసిన నాయకులనే ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. ఐదేళ్ళ పదవీ కాలంలో ఆఖరి ఆరు నెలలూ మాత్రమే ప్రజల ముందుకు వచ్చి డబ్బులు పంచుతూ ఓట్లేయమని అడిగే వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. గత పదేళ్ళలో మీ బ్యాంకు ఖాతాలను చెక్ చేసుకోండని, టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎంత ప్రభుత్వ లబ్ధి చేకూరిందీ, తన హయాంలో ఎంత జమ అయిందీ సరి చూసుకోమని అడిగే దమ్ము సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్త ప్రతి ఇంటికి కాలర్ ఎగురవేసుకుని జగన్ ప్రభుత్వానికి ఓటు వేయమని గర్వంగా అడిగే పరిస్థితి ఉందన్నారు. పార్టీలకు అతీతంగా మేలు చేసిన నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపర్చాలనే కుట్రలతో ఏకమైన దుష్ట చతుష్టయంపై పోరుకు సిద్ధం కావాలని ఎమ్మెల్సీ తోట పిలుపు నిచ్చారు.

దెందులూరు సభకు తరలి రావాలి

ఏలూరు సమీపంలోని దెందులూరులో వచ్చే నెల 3 వ తేదీన వైఎస్సార్ సీపీ అధిష్టానం భారీ ఎత్తున నిర్వహించే , సీఎం జగన్ ప్రసంగించే పోరుకు సిద్ధం బహిరంగ సభకు మండలంలోని 19 గ్రామాల ప్రజలను సమీకరించేందుకు సన్నద్ధం కావాలని కార్యకర్తలను ఎమ్మెల్సీ తోట ఆదేశించారు. సభకు తరలి వెళ్ళేందుకు వాహనాలు, సన్నాహక సమావేశాలు నిర్వహణ తదితర అంశాలపై గ్రామ నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

అంగర, పడమర ఖండ్రిక, తాతపూడి, కపిలేశ్వరపురం, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, వడ్లమూరు, నిడసనమెట్ట, అచ్యుతాపురం, నల్లూరు, కాలేరు, టేకి, మాచర, నాగులచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పోరుకు సిద్ధం సమావేశానికి తరలివచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గుణ్ణం భానుప్రసాద్, సాకా శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, అంగర, పడమర ఖండ్రిక పంచాయతీల సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, మండల పరిషత్ విప్ పలివెల మధు, పార్టీ పలు విభాగాల నాయకులు అరదాని శ్రీదేవి, పనలపూడి శ్రీనివాస్, పాలింగి శ్రీనివాస్, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.



అంగరలో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కౌరవ సేనతో యుద్ధానికి సిద్ధం కావాలి

- ప్రతి కార్యకర్తా ఒక సైనికుడు కావాలి
- మేలు చేసే ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలి
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- చెల్లూరులో వైఎస్సార్ సీపీ మండల స్థాయి సిద్ధం' సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: ఇది న్యాయానికి..అన్యాయానికి, నీతికి..అవినీతికి, కౌరవులకు..పాండవులకు మధ్య జరుగుతున్న యుద్ధమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఇందులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ కౌరవ సేనతో యుద్ధానికి సిద్ధమవుతోందని ఆయన న్నారు. పార్టీ శ్రేణులందరూ సర్వసన్నద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. చెల్లూరులోని చింతా సుబ్బారాయుడు ఫంక్షన్ హాల్లో సోమవారం వైఎస్సార్ సీపీ శ్రేణుల మండల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. చెల్లూరు సర్పంచ్ పాలిక రాఘవ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ ఫిబ్రవరి 3న ఏలూరు సమీపంలోని దెందులూరులో యుద్ధానికి సిద్ధం అనే పేరుతో నిర్వహించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభకు అధిక సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో అంతిమ విజయం తిరిగి వైఎస్సార్‌సీపీనే వరిస్తుందని, మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయయన్నారు.

ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీలోని ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని తోట త్రిమూర్తులు అన్నారు. పలు సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి, కుటుంబానికి మేలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయాల్సిన చారిత్రక అవసరం ఉందన్నారు. లేకుంటే సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోయే ప్రమాదముందన్నారు.

సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైస్ ఎంపీపీలు గుబ్బల సుబ్రహ్మణ్యం, కొవ్వూరి అమ్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, పార్టీ నేత, కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, నేతలు రిమ్మలపూడి సత్యనారాయణచౌదరి, చైతన్య రాజబాబు తదితరులు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి ప్రభుత్వ సమర్థ పాలనకు గీటురాయిగా నిలుస్తాయన్నారు. సమావేశానికి మండలంలోని 12 గ్రామాల నుంచి రెట్టించిన ఉత్సాహంతో కార్యకర్తలు హాజరయ్యారు. జై జగన్..జై తోట నినాదాలతో సభా ప్రాంగణమంతా మార్మోగింది. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి సత్యనారాయణరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, బూత్ కమిటీ కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ తవిటికి రత్నకుమార్, మండల సేవాదళ్ అధ్యక్షుడు వెలగల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు బోస్



సర్వసభ్య సమావేశంలో ప్రగతిని వివరిస్తున్న పశువైద్యాధికారి బిందు



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బోస్

కె.గంగవరం: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్ హాజరయ్యారు. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాఖల వారీగా ప్రగతి నివేదికను సభ్యులకు వివరించాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వెలుగు, ఎంజీఎన్‌ఆర్‌జీఎస్, వైద్య, విద్య తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు నివేదిక చదివి సభలో వినిపించారు. అయితే ఆయా శాఖలకు చెందిన సభ్యులు సమస్యలపై అధికారులను నిలదీశారు. ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ విషయంలో ప్రజాప్రతినిధులకు కూడా సమాచారం లేకుండా చేస్తున్నారని ఇకపై పంపిణీలో ఎంపీటీసీలను, సర్పంచ్‌లను భాగస్వాములను చేయాలన్నారు. జగనన్న ఇళ్లకాలనీల వద్ద రోడ్లు నిర్మించాలని కోరారు. సుందరపల్లి ఎంపీటీసీ రాజు మాట్లాడుతూ గ్రామంలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలని తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువెళ్లారు. పాణింగపల్లి సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల అధికారులు గ్రామ స్థాయిలో జరిగే ఏ కార్యక్రమానికి కూడా సర్పంచ్‌లకు తెలియజేయడం లేదని ఇదేం పని అంటూ అధికారులను నిలదీశారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

మండల, గ్రామ స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో భాగస్వాములై ప్రజా సమస్యలను పరిష్కరించాలని రాజ్యసభ సభ్యుడు బోస్ సూచించారు. ప్రభుత్వ కార్యక్రమం ఏదైనా సరే ప్రజాప్రతినిధులకు సమాచారం అందించి వారితో కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో రోడ్లు, శ్మశానాలు, ఖాళీ స్థలాల్లో చెట్లు నాటాలని ఎంజీఎన్‌ఆర్‌జీ ఏపీఎంకు సూచించారు. చెట్లు నాటడంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సహకరించాలని కోరారు. వరిసాగు విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలని అధికారులకు సూచించారు.

ప్రతి గ్రామంలోను శ్రీనిధి సొమ్ముల విషయంలో అవకతవకలు జరిగాయని వెంటనే గ్రామ స్థాయి నుంచి విచారణ జరిపించాలని ఎంపీడీఓకు ఆదేశించారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, వైస్ ఎంపీపీలు దూడల నాగేశ్వరరావు, నీతిపూడి మధుబాల, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పందు గోవిందరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహేష్‌బాబు అభిమానుల హంగామా



మండపేటలో సందడి చేస్తున్న మహేష్ అభిమానులు

కపిలేశ్వరపురం (మండపేట): తమ అభిమాన నటుడు ఘట్టమనేని మహేష్ బాబు 25 ఏళ్ల సినీ కెరీర్‌ను పూర్తి చేసుకున్న సందర్భంగా మండపేట పట్టణ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రజతోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ×గుంటూరు కారం× చిత్ర పంపిణీదారులు పడాల దుర్గారెడ్డి అభిమానులతో సందడి చేశారు. మహేష్‌బాబు తన సినీ చరిత్రలో విభిన్న పాత్రలను పోషిస్తూ అభిమానులను అలరించారన్నారు. నటుడుగానే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలతో మహేష్‌బాబు తన జీవితాన్ని సార్థకం చేసుకుంటున్నారని అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మెండు సత్తిబాబు, దుగ్గిరాల రాంబాబు, మెండు రవిచంద్ర, పోలుబోతు గణేష్, అరుణ్, బాబ్జీ, దుగ్గిరాల గణేష్ అభిమానులు పాల్గొన్నారు.

సేవా పురస్కార గ్రహీతలకు సన్మానం

ఆలమూరు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న అధికారులకు సోమవారం సత్కారం జరిగింది. స్థానిక ఎంపీపీ కార్యాలయ ఆవరణలో మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలైన తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీవో కె.జాన్‌లింకన్, ఎంఈవో పి.షాలెంరాజు, గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబుకు శాలువ కప్పి, జ్ఞాపికను అందించి ఘనంగా సత్కరించారు. అలాగే వైఎస్సార్ పీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఉత్తమ పురస్కార గ్రహీతలకు వేర్వేరుగా ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు, భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, యూటీఎఫ్ నేతలు కేవీఆర్ బాపూజీ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్

రామచంద్రపురం: శరవేగంగా పెరుగుతున్న పట్టణానికి అనుగుణంగా అభివృద్ధి చేసే విధంగా కృషి చేయనున్నట్లు రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీ బోస్ హాజరయ్యారు. తొలుత జరిగిన సాధారణ సమావేశంలోని 19 అంశాలకు చెందిన అభివృద్ధి పనుల టెండర్లు, నిధుల మంజూరుకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం జరిగిన ప్రత్యేక సమావేశ అజెండాలోని 3 అంశాలకు చెందిన అభివృద్ధి పనుల టెండర్లకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ మున్సిపల్ వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, కౌన్సిలర్ కట్టా శ్రీరాములు తదితరులు పలు సమస్యలపై కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డిని వివరణ కోరగా దానికి సమాధానాలను తెలియజేశారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ బోస్ మాట్లాడుతూ టిడ్కో గృహాలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కమిషనర్‌కు సత్కారం

ఇప్పటివరకు కమిషనర్‌గా విధులు నిర్వహించిన శ్రీకాంత్‌రెడ్డి గుడివాడకు బదిలీ అయ్యారు. ఈమేరకు చైర్‌పర్సన్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఎంపీ బోస్ ముఖ్యఅతిథిగా పాల్గొని కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు సిబ్బంది కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని ఎంపీ బోస్ ఘనంగా సత్కరించారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్‌ను సత్కరిస్తున్న చైర్ పర్సన్ దుర్గారాణి, రాజుబాబు

కపిలేశ్వరపురం (మండపేట): బదిలీపై ధర్మవరం వెళ్తున్న మండపేట మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌ను చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మున్సిపల్ కో –ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, కౌన్సిలర్లు ఘనంగా సత్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ ఐదేళ్లలో పట్టణాభివృద్ధికి రామ్‌కుమార్ విశేషంగా కృషి చేశారన్నారు. ప్రభుత్వ అధికారులు ఎక్కడ స్థిరపడినా ఉద్యోగ ప్రదేశాల్లో వారు చేసిన సేవలు స్థిరస్థాయిగా గుర్తిండుపోతాయన్నారు.రెడ్డి రాజుబాబు మాట్లాడుతూ రామ్‌కుమార్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా, పీఏసీఎస్ చైర్మన్ పెంకే గంగాధరం, ఏఎంసీ డైరెక్టర్ కొప్పిరెడ్డి పద్మావతి, కౌన్సిలర్లు ఎర్నేన ప్రభావతి, సవరపు సతీష్, మలసాని సీతామహాలక్ష్మి, శెట్టి కళ్యాణి, గ్రంధి శ్రీనివాసు, నీలం దుర్గ, పిల్లి శ్రీనివాసు, నాయకులు సాధనాల శివ భగవాన్, శెట్టి నాగేశ్వరరావు, సూరంపూడి సత్య ప్రసాద్ పాల్గొన్నారు.

సూర్యప్రకాష్‌ను కలసిన క్రిస్టియన్ నాయకులు



సూర్యప్రకాశ్‌ను కలసిన జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు

రామచంద్రపురం: నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్‌ను జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు సోమవారం పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల పిల్లి సూర్యప్రకాష్‌ను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్‌గా నియమించిన నేపథ్యంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కె.బాబూరావు, ఉపాధ్యక్షుడు ఫిలిప్ రాజు, జనరల్ సెక్రటరీ కె.సూర్యప్రకాష్, సెక్రటరీ వై.శామ్యూల్ రాజు, జాయింట్ సెక్రటరీ మాషీలామనిలు సూర్యప్రకాష్‌ను కలిసి అభినందించారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు ఎస్.ప్రభు కుమార్, నాయకులు ఎలీషా, బిషప్ విక్టర్ నందా, డేవిడ్, మండలంలోని పాస్టర్లు పాల్గొన్నారు.

బాలికా విద్యతోనే సమాజం పురోగతి



జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని కాజులూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, పాఠశాల విద్యార్థినులు

కాజులూరు: బాలికా విద్యతోనే సమాజం పురోగతి సాధిస్తుందని తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీఓ మాధవి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని కాజులూరులో సోమవారం ఐసీడీఎస్ సిబ్బంది నిర్వహించిన 'బేటీ బచావో బేటీ పఢావో' కార్యక్రమంలో సీడీపీఓ మాధవి పాల్గొని బాలికా హక్కులు, బాలికల శరీర శుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర విషయాలపై బాలికలు, మహిళలకు అవగాహన కల్పించారు. గ్రామాలలో బాలికా విద్యకు ప్రాధాన్యతనివ్వాలని ఒక కుటుంబంలో పురుషుడు విద్యనభ్యసిస్తే తాను మాత్రమే విద్యవంతుడవుతాడని అదే మహిళ విద్యనభ్యసిస్తే ఆ కుటుంబం అంతా విద్యావంతులవుతారన్నారు. కిశోర బాలికలతో ఆటల పోటీలు, ర్యాలీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

దిశ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



కె.గంగవరం ఉన్నత పాఠశాలలో దిశ చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజ్యలక్ష్మి

కె.గంగవరం: ప్రభుత్వ చేసిన దిశ చట్టంపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని దిశ పోలీస్ స్టేసన్ ఎస్సై డి.రాజ్యలక్ష్మి సూచించారు. మండల కేంద్రమైన కె.గంగవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దిశ చట్టం, బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. విద్యార్థినులు మారుతున్న కాలానికి అనుగుణంగా జాగ్రత్తగా ఉండాలని, విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు నేర్చుకోవడంతో పాటు చదువు, క్రీడల్లో ముందుండాలని సూచించారు. బాలికలకు భద్రత విషయంలో సహాయం అవసరమైతే నిర్భయంగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం యండగండిలోని హెరిటేజ్ పాల ఫ్యాక్టరీ కార్మికులకు కూడా దిశ చట్టంపై అవగాహన కల్పించారు. దిశ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ రషీద, హెచ్‌ఎం పాడగట్లపల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మానందం, ఏడుకొండలు, శ్రీనివాస్, రాఘవకుమారి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అఖిల భారత రైతు కూలీ మహాసభలు విజయవంతం చేయండి



వెంకటాయపాలెంలో ఏఐకేఎంఎస్ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రామచంద్రపురం రూరల్: అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3, 4 తేదీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా గురజాలలో జరగనున్న 10వ అఖిల భారత రైతు కూలీ సంఘం మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం పిలుపునిచ్చారు. మండలంలోని వెంకటాయపాలెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం మహాసభల గోడ పత్రికను ప్రజా సంఘాల నాయకులతో కలసి ఆవిష్కరించారు. భీమశంకరం మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగాన్ని మోదీ ప్రభుత్వం సంక్షోభంలో నెట్టిందన్నారు. వ్యవసాయం చేస్తున్న రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీని తుంగలో తొక్కి కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి లేని పేదలకు భూములు పంచే భూ సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందన్నారు. ఆదివాసీలను అడవుల నుంచి గెంటి వేయడానికి నూతన అటవీ హక్కుల చట్టాన్ని తెచ్చిందన్నారు. ఆ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు అంబటి కృష్ణ, సీహెచ్ రాజారెడ్డి, పీడీఎస్‌యూ నాయకులు బి.సిద్ధూ, టి.లక్ష్మణ్, గ్రామ రైతు కూలీ నాయకులు డి.శ్రీను, కె.సూరిబాబు, వి.రాజేంద్రప్రసాద్, టి.బాబేలు, పి.వీర్రాజు పాల్గొన్నారు.

సారా, మద్యం కేసుల్లో ముగ్గురి అరెస్టు

రాయవరం: సారా తరలిస్తున్న కొండ్రపు చిన్న అబ్బాయి అనే వ్యక్తిని మాచవరం గ్రామంలో అరెస్టు చేసినట్టు రాయవరం ఎస్సై జి.నరేష్ సోమవారం తెలిపారు. అతడి వద్ద నుంచి 22 లీటర్ల సారా, రూ.2,080 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే పసలపూడిలో మద్యం బాటిల్ విక్రయిస్తున్న ఒక మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి ఎనిమిది మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అలాగే మాచవరంలో 14 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని మరో మహిళను అరెస్టు చేసినట్టు చెప్పారు.